క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



యర్నగూడెంలో గడా జగదీష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

దేవరపల్లి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ అధికార ప్రతినిధి, చిన్నాయగూడెం సొసైటీ అధ్యక్షుడు గడా జగదీష్ అభినందన సభ ఆదివారం రాత్రి యర్నగూడెంలోని ఫంక్షన్ హాల్లో జరిగింది. సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా గడా జగదీష్‌ను గజమాలతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే వల్లీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, వైస్ ఎంపీపీ సాదె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం

గోపాలపురం: వేళ్లచింతలగూడేనికి చెందిన దివ్యాంగ విద్యార్థి వినయ్‌కు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ సభ్యులు ఆదివారం బియ్యం రూ. 3 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కృపావరప్రసాద్ మాట్లాడుతూ వినయ్ తల్లిదండ్రులిద్దరూ మృతి చెందారన్నారు. తనకొచ్చే వృద్ధాప్యపు పింఛనుతో అతడి అమ్మమ్మ వినయ్‌ను పోషిస్తోందని చెప్పారు. కాగా అలాగే గోపాలపురం మండల అరుంధతీయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ రూ. ఐదు వేల నగదును దివ్యాంగ విద్యార్థి వినయ్‌కు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్‌గా న్యూటన్‌పాండు

నిడదవోలు రూరల్: యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్‌గా విప్పర్తి ఐజక్ న్యూటన్ పాండు వరుసగా 14వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం ఆదివారం నిడదవోలులోని డీఎస్ మున్సిపల్ హైస్కూల్లో జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. న్యూటన్ పాండును తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వి.సూర్యనారాయణ శాస్త్రి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర

కొవ్వూరు: బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పిక్కి నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. నాలుగేళ్లుగా నాగేంద్ర పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధిత సంక్షేమ పథకాలు రైతులందరికీ ఉపయోగలా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి కేటాయించినందుకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, ఇతర నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, రోటరీ సభ్యులు

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక్క మొక్క నాటి వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ, రోటరీ సెంట్రల్ క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ మిడ్ టౌన్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సుమారు 150 మొక్కలు నాటారు. మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరైవన మహోత్సవాన్ని ప్రారంభించారు. క్లబ్‌ల అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, బొల్లా శ్రీనివాస్ గౌడ్, గుంపుల వెంకటేశ్వరరావు, కార్యదర్శులు గుంటుపల్లి శివకుమార్, చైన్లు రాజా, ఆకుల రాజీవ్, కోశాధికారులు కాళ్ల రాంబాబు, కొత్తపల్లి మనోజ్, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న మంత్రి తానేటి వనిత, స్థానిక నాయకులు



దేవరపల్లిలో బాలదుర్గమ్మ వారిని దర్శించుకుంటున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు



నిడదవోలు చింతచెట్టు వీధిలోని దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భవానీ దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

కొలువుదీరిన జగన్మాత

- శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- భవానీ భక్తులతో గోష్పాద క్షేత్రంలో సందడి

కొవ్వూరు: శరన్నవరాత్ర ఉత్సవాలు మొదలయ్యాయి. భక్తులతో పూజలు అందుకునేందుకు ఊరూరా దుర్గామాత కొలువు దీరారు. మరోపక్క కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం భక్తజన సంద్రమైంది. ఆదివారం తెల్లవారు జాము నుంచి భవానీ దీక్ష స్వీకరించేందుకు వచ్చిన భక్తులతో ఈ నదీ తీరం కళకళలాడింది. జై భవానీ నామ స్మరణతో ఈ క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు భవానీ దీక్ష చేపట్టి, మాలలు ధరించే భక్తులు విజయ దశమి నాడు విజయవాడ ఇంద్ర కీలాద్రిపై కొలువైన దుర్గామాత దర్శనానికి తరలి వెళతారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గోష్పాద క్షేత్రంలోని సరస్వతీ ఆలయంలో చండీ హోమాన్ని ప్రారంభించారు. అలాగే పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా ఉత్సవాలు మొదలయ్యాయి. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, అచ్చాయమ్మ కాలనీ, బస్టాండ్ సెంటర్, మెరక వీధి వినాయకుడి గుడి వద్ద గల కనక దుర్గమ్మ అలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గోష్పాద క్షేత్రంలోని విజయ దుర్గ అమ్మవారి ఆలయంలోను, బాలత్రిపుర సుందరి అమ్మవారు, గాయత్రీ దేవి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెరక వీధిలోని మద్దుల కృష్ణారావు స్వగృహం నుంచి వాసవీ అమ్మవారిని ఊరేగింపుగా కల్యాణ మండపం వరకూ తీసుకుని వచ్చారు. వందలాది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, విజయలక్ష్మి దంపతులచే కన్యాకా పరమేశ్వరి అమ్మవారి కలశస్థాపన పూజ చేశారు. గోత్ర నామాలతో మహిళలు కుంకుమ పూజలు, అర్చనలు, సుహాసిని పూజ నిర్వహించారు.ఆదివారం అమ్మవారిని వాసవీ కన్యాకాపరమేశ్వరిగా అలంకరించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కక్కిరాల సూరిబాబు, నాళం శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, కొల్లేపర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.



ఉండ్రాజవరంలో ముత్యాలమ్మ వారి అలంకరణ



తాళ్లపూడిలో బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో..



నల్లజర్ల వనదుర్గ ఆలయంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కనకదురమ్మను దర్శించుకున్న మంత్రి వనిత

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల కనక దుర్గమ్మ ఆలయంలో ఆదివారం కలశ పూజ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ కమిటీ చీర, కలశం బిందెలు పంపిణీ చేసింది. మంత్రి వనిత, మార్గాని నాగేశ్వరరావు దంపతులను సత్కరించారు. చాగల్లు వాసవీమాత ఆలయం వద్ద 108 మంది మహిళలతో అమ్మవారికి జలాభిషేకం, విశేష పూజలతో దసరా ఉత్సవాలు ప్రారంభించారు. పలుచోట్ల భవానీలు గ్రామోత్సవం నిర్వహించారు. బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ , రావుల చెరువు వద్ద గల కనకదుర్గమ్మ, ఊనగట్ల బీసీ ఏరియాలోని కనక దుర్గ అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి.

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ వారిని ఆదివారం బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అర్చకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, లలితా సహస్ర నామ పారాయణ, కుంకుమ పూజలు, పల్లకీ సేవ నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీ దేవి ఆలయం వద్ద, మలకపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. వేగేశ్వరపురంలో దుర్గాసాయిరామ్ మేదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనక దుర్గమ్మ వారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గజ్జరం , అన్నదేవరపేట, తాడిపూడి, పైడిమెట్ట తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మ వారి విగ్రహాలు ఏర్పాటు చేసి దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు.

బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో జగన్మాత

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేపట్టారు. తొలి రోజు అమ్మవారిని బాల త్రిపురసుందరి దేవిగా అలంకరించి, కుంకుమ పూజలు చేశారు. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ వారి ఆలయం వద్ద ప్రారంభమైన దసరా ఉత్సవాల్లో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు ఎమ్మెల్యే వెంకట్రావుకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్థానిక సౌభాగ్య దుర్గాంబికా అమ్మవారిని కూడా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువు దీరిన దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ నడిబొడ్డున కొలువైన నంగాలమ్మ వారిని స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ దర్శించుకుని పూజలు చేశారు. అలాగే స్థానిక చింతచెట్టు సెంటర్ వద్ద కొలువుదీరిన అమ్మవారిని కూడా వారిద్దరూ దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముండండి కృపానందం, ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగా నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లిలోని స్వర్ణ దుర్గాశ్రమంలో అవిర్నీ రామచంద్రరావు, ఝాన్సీలక్ష్మి దంపతులు దసరా తొలి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద కుంకుమ పూజలు,అభిషేకాలు జరిగాయి. అన్న సమారాధన చేశారు. నల్లజర్లలోని వనదుర్గ ఆలయంలో అమ్మవారిని వనదుర్గా దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. తూర్పుచోడవరం, దూబచర్ల, కవులూరు తదితర గ్రామాల్లోనూ శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి కనకదుర్గమ్మ ఆలయంలో ఆర్చకుడు లక్ష్మీ ధన్వంతరి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మోర్త గ్రామంలో విజయ కనకదుర్గమ్మ, ఉండ్రాజవరంలో ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ, వేలివెన్నులో ముక్కుళ్లమ్మ, కె.సావరంలో ముత్యాలమ్మ ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో వైభవంగా నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. పలుచోట్ల భవానీ మాలధారులు అమ్మవారి మండపాల వద్ద సందడి చేస్తున్నారు.

గోలింగేశ్వరునికి లక్ష పత్రి పూజ



స్వామివారికి లక్షపత్రి పూజ



ప్రత్యేక అలంకారంలో రాజరాజేశ్వరి వారు

నిడదవోలు: పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం 629వ లక్ష పత్రి, కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు పురుషోత్తం ఆధ్వర్యంలో వేద పండితులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పేదల జీవితాల్లో వెలుగు

- హోం మంత్రి తానేటి వనిత
- బల్లిపాడు, పెద్దేవం శివారు వార్డులో గడప గడపకూ..

తాళ్లపూడి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని బల్లిపాడు, పెద్దేవం శివారు వార్డులో ఆదివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను మంత్రి తానేటి వనిత ఓపిగ్గా విన్నారు.వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. జగనన్న ప్రభుత్వ హయంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించే బుక్ లెట్‌లను ప్రజలకు అందజేశారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ఎల్లిన శివరామకృష్ణ, తిగిరిపల్లి వెంకటరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. దమయంతి, నాయకులు తోట రామకృష్ణ, గనిశెట్టి బంగారు రాజు, పసలపూడి గంగరాజు, కంకిపాటి రవి, ఆయా శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

108 మందికి కంటి పరీక్షలు

కొవ్వూరు: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం గెల్లా కేశవ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నిడదవోలు లయన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు సీహెచ్ నాగరాజు, శ్రావణి 108 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 16 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అంతకు ముందు వీర్రాజు పుట్టిన రోజు సందర్భంగా నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, చెరుకూరి సాయిరాజు, ఎండీ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళి

చాగల్లు: చాగల్లు, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. కలాం చిత్ర పటానికి గ్రంథ పాలకులు గద్దె శ్రీనివాస్, సుమన్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, అణు శాస్త్రవేత్తగా దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

పూజా వేదిక ప్రారంభం

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామ వినాయకుడి గుడి వద్ద నిర్మించిన పూజా వేదికను ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని గ్రామానికి చెందిన దుగ్గిరాల సూర్యచంద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ.రెండు లక్షల వ్యయంతో ఈ పూజా వేదికను నిర్మించారు.

50 మంది కోటసత్తెమ్మ దీక్షల స్వీకరణ



కోటసత్తెమ్మ దీక్ష చేపట్టిన భక్తులతో ఆలయ కమిటీ సభ్యులు

- ఘనంగా శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- అమ్మవారికి ప్రత్యేక సహస్ర నామ కుంకుమ పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ దేవులపల్లి శంకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కలశ స్థాపనతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోటసత్తెమ్మ, గోపవరంలోని గుబ్బాలమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో 168 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు చేశారని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. ప్రధానార్చకుడు ఎస్ వీకేఏ శర్మ అమ్మవారికి విశేష పూజలు, హోమాలు చేశారు. సుమారు 50 మంది భక్తులు కోటసత్తెమ్మ దీక్ష చేపట్టారు. వివిధ అమ్మవారికి రూపాల్లో రూ.1,05,520 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కరరావు, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి పాల్గొన్నారు.

అలాగే గోపవరంలోని గుబ్బాలమ్మ, సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ, లోహియా నగర్‌లోని కనకదుర్గమ్మ, కోరుమామిడి గ్రామ అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి, సింగవరంలోని ముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మునిపల్లిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వారికి విష్ణు సహస్రనామ స్తోత్రాలు, గోవింద నామాలతో అర్చకులు వైవీఎస్ రామకృష్ణచార్యులు, రాధాకృష్ణ చార్యులు పూజలు చేశారు.అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు

డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

నిడదవోలు: ప్రభుత్వ, ప్రభుత్వేతర డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జ్యోతి తెలిపారు. డిగ్రీలో చేరే విద్యార్థులు ఈనెల 16 నుంచి 21వతేదీ లోపు రూ.400 అడ్మిషన్ ఫీజుతో పాటు రూ.100 అదనపు ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. గతంలో ఎక్కడైనా అడ్మిషన్ పొందిన విద్యార్థులు అనర్హులని ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు.

పథకాలపై వైఎస్సార్ సీపీ ప్రచారం

తాళ్లపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాల ఇంటింటి పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు చేపట్టాయి. మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం మలకపల్లి గ్రామంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్టీ శ్రేణులు ఆ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే కర పత్రాలను పంపిణీ చేశారు. ×ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం మరో సారి వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం× అనే స్టిక్కర్‌లను గోడలకు అతికించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, మంత్రి వనితమ్మను మళ్లీ గెలిపిద్దాం.. జగనన్నను సీఎం చేద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు సూదిన అనిత పద్మ, పూడి వరలక్ష్మి, పార్టీ నాయకులు సూదిన సూరిబాబు, పూడి బుచ్చియ్య, అబ్బులు, మూతిన చిరంజీవి, గద్దే ప్రభాకర్, ఎరబ్బులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



మలకపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నిడదవోలు: విద్యుదాఘాతానికి గురై పుచ్చకాయల మనోజ్‌కుమార్ (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం పట్టణంలోని ఆరో వార్డులోని కాపుల వీధిలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై పి.నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ వీధిలోని ఓ బిల్డింగ్‌పై పోర్షన్‌లో మనోజ్‌కుమార్ తన భార్య లలితతో కలసి ఉంటున్నాడు. ఇటీవల అద్దెకు ఇచ్చిన ఆ బిల్డింగ్ కింద పోర్షన్ ఖాళీ చేయడంతో కింద పోర్షన్‌లోకి కాపురం ఉండేందుకు భార్యాభర్తలు ఆదివారం గదులను శుభ్రం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మనోజ్‌కుమార్ విద్యుత్తు బోర్డులో కరెంట్ పని చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కర్ర సాయంతో విద్యుత్ బోర్డు నుంచి మనోజ్‌ను వేరు చేశారు. మనోజ్‌కుమార్‌ను 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి అతడు మృతి చెందినట్టు పేర్కొన్నారు. గత జనవరిలో మనోజ్‌కుమార్, లలితలు ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు వివరించారు.



మనోజ్‌కుమార్ మృతదేహం

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయం

నిడదవోలు: ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా మహిళలు చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి సరిత లునాని కొనియాడారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం ఇన్నర్ వీల్ క్లబ్ మల్టీ జోనల్ మీట్ ఘనంగా నిర్వహించారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఎ.శ్రీదేవి సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సరిత లునాని మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దసరా సందర్భంగా చిన్నారులు వేసిన అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి. మహిళలకు ఫన్నీ గేమ్స్, హౌసీ, లక్కీ డిప్ నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక చర్ల సుశీల వృద్ధాశ్రమానికి రెండు మంచాలు, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 11వ వార్డులో క్లబ్ తరుపున సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. నాలుగు జోన్ల నుంచి హాజరైన క్లబ్ అధ్యక్షులు తాము చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సరితా లునానిని నిడదవోలు క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిడదవోలు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఎండీ షాకిరాబేగం, ఫాస్ట్ చైర్‌పర్సన్ కామిశెట్టి రాజీ, క్లబ్ కార్యదర్శి చిలకల శారదాదేవి, కేదారిశెట్టి సునీత, అశర్వాణి, సూర్యకుమారి, నీలం సరిత, గోపిరెడ్డి రేఖ, గుంటిపల్లి సత్యకుమారి, గమిని దీప్తి, ఫాస్ట్ డిస్ట్రిక్ చైర్మన్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సరిత లునాని

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com